

నమ్మి మోసపోవద్దు

ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు.

- 8లో ▸



భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.2 /24.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అనుమతి లేని పాఠశాలల తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలల పై తనిఖీలు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గ ప్రసాద్ శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'సాక్షి'లో అనుమతి అక్కర లేదా! శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఇదివరకే అనుమతి లేకుండా కొనసాగుతున్న నాలుగు పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలల పై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీఈవో పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



సుభాష్‌నగర్ : ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు–చేర్పులకు అవకాశం కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ నెల 26, 27 తేదీలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోలతో పాటు ఎన్నికల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, ఇతర మార్పులు, చేర్పులకు సంబంధించిన నిర్ణీత నమూనా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయని, వాటిని పూరించి బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. ఇటీవల విడుదల చేసిన ఓటరు డ్రాఫ్ట్ రోల్‌కు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. అక్టోబర్ 4న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

డీఎస్సీ @309 పోస్టులు



గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు

నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ

- భర్తీకి అనుమతిచ్చిన ప్రభుత్వం
- జిల్లాలో 5,914 పోస్టులు ఖాళీ
- వేల సంఖ్యలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు

నిజామాబాద్‌అర్బన్ : జిల్లాలో డీఎస్సీకి సంబంధించి పోస్టుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5914 పోస్టులు మంజూరు చేశారు. ఇందులో 4902 పోస్టుల భర్తీకి అనుమతి లభించింది. కొత్త జోన్ల ఏర్పాటు సందర్భంగా ఈ ఖాళీలను గుర్తిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. అయితే తాజాగా డీఎస్సీ నిర్వహణకు అనుమతిస్తూ ఖాళీలలో భారీగా కోత విధించారు. 4902 పోస్టులను కేవలం 309 పోస్టులకు కుదిస్తూ భర్తీకి అనుమతి ఇచ్చారు. కాగా హైదరాబాద్ తర్వాత జిల్లాలోనే ఎక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నారు. శుక్రవారం ప్రభుత్వం జిల్లాల వారీగా టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు పోస్టులను మంజూరు చేసింది. మరోవైపు ఇప్పటికే టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. కాగా సెప్టెంబర్ 19న మరో మారు టెట్ పరీక్ష నిర్వహిస్తారు. దీనికి జిల్లా నుంచి సుమారు పదివేల మంది ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. పోస్టులు మాత్రం కేవలం 309 మాత్రమే ఉన్నాయి. కొన్నేళ్లుగా జిల్లాలోని టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉపాధ్యాయ నియామక పరీక్ష కోసం ఎదురు చూస్తున్నారు. కాగా జిల్లాలో 1194 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2 లక్షల 80 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ మాత్రం నిరాశజనకంగా ఉంది.

జిల్లాలో టెట్ రాసిన అభ్యర్థులు

	దరఖాస్తుదారులు	పరీక్షకు హాజరు	అర్హత సాధించినవారు
పేపర్–1	16,454	15,436	4,880
పేపర్–2	12,462	11,565	5,383

ఉపాధ్యాయ పోస్టుల వివరాలు

స్కూల్ అసిస్టెంట్	సెకండరీ గ్రేడ్ టీచర్	లాంగ్వేజ్ పండిత్	పీఈటీ
96	183	21	09

షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలి



టీఆర్‌టీ నియామకాలు షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలి. ఇకనైనా ఆలస్యం చేయవద్దు గత కొన్ని సంవత్సరాలుగా అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. వయస్సు పైబడి పోతోంది. ప్రభుత్వం ఏమాత్రం ఇతర కారణాలు చూపి ఎంపిక ప్రక్రియను నిలిపేయవద్దు.

–హీరమన్, డీఎస్సీ అభ్యర్థి

ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలి



డీఎస్సీ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలి. అప్పుడే అర్హత పరీక్ష నిర్వహించాలి. ఇప్పటికే టీఎస్ పీఎస్సీ పరీక్షలు కూడా ఉన్నాయి. వాటిని పరిగణనలోకి తీసుకోవాలి.

–సంతోష్, డీఎస్సీ అభ్యర్థి

కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీదే అధికారం



హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన ఎంపీ



రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలతో ఎంపీ

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

ఆర్మూర్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆర్మూర్‌లోని జంబి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంకాపూర్‌లోని బీజేపీ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. సుమారు 120 మంది ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు రక్తదానంలో పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువకులను అర్వింద్ అభినందించారు. బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, రాకేష్‌రెడ్డి, పుప్పాల శివరాజ్, ద్యాగ ఉదయ్, ఆకుల రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టిక్కెట్లకు భారీ దరఖాస్తులు



టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్న గోర్త రాజేందర్

ఖలీల్‌వాడి : కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో టిక్కెట్ల కోసం శుక్రవారం ముగింపు కావడంతో పోటీపడి దరఖాస్తులు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో క్యూ కట్టారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గోర్త రాజేందర్ (అర్గుల్) దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో జరిగే ప్రజాగర్జన సభలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ కోశాధికారి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ అనిల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తనకు టికెట్ ఇస్తే ఆర్మూర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలను ఐక్యత చేసి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేస్తానన్నారు. బాల్కొండ నుంచి బాస వేణుగోపాల్ యాదవ్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, బోధన్ నుంచి కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

తగ్గేదే లేదు..

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ వందకు పైగా అసెంబ్లీ స్థానాలు దక్కించుకుంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తగ్గేదే లేదన్నారు.



- వివరాలు 8లో..

క్లుప్తంగా

టీయూ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా బాలకిషన్



తెయూ(డిచ్‌పల్లి): టీయూ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా జి.బాలకిషన్ నియామకమయ్యారు. టీయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శుక్రవారం బాలకిషన్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. గతంలో బాలకిషన్ అకడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా, అడ్మిషన్ డైరెక్టర్‌గా, అసిస్టెంట్ కంట్రోలర్‌గా పని చేశారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రార్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



తెయూ(డిచ్‌పల్లి): టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయ బ్రహ్మకుమారీలు శుక్రవారం రాఖీ కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మానవీయ విలువలతో కూడిన విద్యను బోధించాలన్నారు. వర్సిటీ ప్రగతిపథంలో ముందుకు సాగాలని, మంచి విద్య మేలైన సమాజ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలని కోరారు. తనకు రాఖీకట్టిన బ్రహ్మకుమారీలకు రిజిస్ట్రార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు కుసుమమ్మ వనజ, సుజాత, నాగభూషణం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ



రాజంపేట: భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని సర్వే నంబరు 453లో ఉన్న భూమి తమదంటూ ముదిరాజ్, ఇతర కుల సంఘాల సభ్యులు ఘర్షణకు దిగారు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ముదిరాజ్‌లు నిర్మాణ పనులు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అనిల్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని గొడవను సద్దుమనిగేలా చేశారు. వివాద స్థలంపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్నారు.

తగ్గేదే లేదు..

- బీఆర్‌ఎస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయం
- మూడో సారి సీఎం కేసీఆరే..
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలి
- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని హ్యాట్రిక్‌తో గెలిపించాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

ఆర్మూర్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ వందకు పైగా ఎమ్మెల్యే స్థానాలు గెలుచుకుంటుందని.. ఇది కేసీఆర్ పార్టీ తగ్గేదే లేదు అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. ఒకే సారి 115 మంది అభ్యర్థులను ప్రకటించిన ఘనత దేశంలో ఏ పార్టీకి లేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆర్మూర్ అసెంబ్లీ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్‌రెడ్డిని ప్రకటించిన అనంతరం మొదటి సారిగా ఆర్మూర్‌కు వచ్చిన సందర్భంగా పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. పెర్కిట్ శివారులోని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నుంచి ఈ ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి క్రేన్‌తో గజమాల వేసి కార్యకర్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. పెర్కిట్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మూడో సారి తమ పార్టీ సీఎం కేసీఆర్ అని, మరి కాంగ్రెస్, బీజేపీల ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలపాలని ప్రశ్నించారు. వ్యవసాయ రంగానికి మూడు గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ కావాలో, వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించమన్న బీజేపీ కావాలో లేక 24 గంటల పాటు వ్యవసాయ రంగానికి విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేపట్టాలన్నారు. జీవోల జీవన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేని చేయాలని సూచించారు.

యుద్ధానికి సిద్ధం..

నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల అండదండలతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ తనకే వచ్చిందంటూ.. తాను యుద్ధాకి సిద్ధంగా ఉన్నానని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. తనపై ఎవరు పోటీకి వస్తారో రండి ఓడించి హ్యాట్రిక్ సాధించి చూపిస్తా అంటూ జీవన్‌రెడ్డి తొడగొట్టి సవాల్ విసిరారు. ఎంపీ అర్వింద్‌కు ఇవే చివరి ఎన్నికలంటూ ఎక్కడ పోటీ చేసినా వెంటపడి, వేటాడి ఓడిస్తామన్నారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు.

ఘన స్వాగతం.. భారీ ర్యాలీ..

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్యకర్తలను పలకరిస్తూ పాదయాత్ర చేపట్టారు. పెర్కిట్ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా, కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా అంకాపూర్ వరకు ర్యాలీ సాగింది. రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా మధుశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు రాజారాం యాదవ్, కోటపాటి నర్సింహ నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి/సిరికొండ/నిజామాబాద్ రూరల్/మోపాల్: ప్రతిపక్ష పార్టీల నేతల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అందులో భాగంగా డిచ్‌పల్లిలోని టీటీడీసీలో శుక్రవారం నూతనంగా దివ్యాంగులకు రూ.4,016 పింఛన్, బీడీ టేకాదార్లకు జీవనభృతి రూ.2,016 మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. రూరల్ మండలంలోని మాధవనగర్‌లోగల ఓ ఫంక్షన్‌హాల్ సుమారు మూడువందల మంది కులవృత్తుల వారికి రూ.1లక్ష చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. అలాగే రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు చేస్తూ, ప్రొసీడింగ్ పత్రాలను ఆయా సంఘాల సభ్యులు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రూరల్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 62,523 మందికి రూ. 13 కోట్ల 44 లక్షల 38,368 ప్రతినెల పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోనే అత్యధిక పింఛన్‌లు వస్తున్న నియోజకవర్గం నిజామాబాద్ రూరల్ కావడం గర్వకారణమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అమలు అవుతుందన్నారు. జిల్లాలో మొదటి విడతగా 622 మంది దివ్యాంగులకు తన సొంత డబ్బులతో ఉచిత బస్సు పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డిచ్‌పల్లి మండలానికి చెందిన 165 మంది దివ్యాంగులకు ఉచిత బస్సుపాసులను అందజేశారు. ఈ నెల 29 ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మోపాల్ మండలం బోర్గం వద్ద గల భూమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఐసీడీఎంఎస్ చైర్మన్ సాంబారీ మోహన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించారని ఫిర్యాదు



సిరికొండ: మండల కేంద్రంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారని కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణ్‌రెడ్డి, నాయకులు బండారి నరేశ్, పోశన్న, సురేశ్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మలేరియా అధికారి తుకారాం రాథోడ్



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రానికి చెందిన సంపత్‌గౌడ్ అనే యువకుడు డెంగీ వ్యాధితో మృతి చెందడంతో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండల కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి మృతుని ఇంటి పరిసరాలను పరిశీలించారు. డెంగీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ ఇంటి పరిసరాల్లోని కుండీలు, టైర్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 65 డెంగీ కేసులను గుర్తించినట్లు చెప్పారు. ఎవరికైనా డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్లాలని సూచించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ వినీత్ రెడ్డి, కంటి వైద్య నిపుణులు రాజ్ కుమార్, రాములు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటా



చెక్కులు అందిస్తున్న ఎంపీ అర్వింద్



సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీ

ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్: బీజేపీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు నిరంతరం అండగా ఉంటానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఎంపీ తన పుట్టినరోజు సందర్భంగా నగరంలోని బస్వా గార్డెన్‌లో అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. ఇందులో భాగంగా కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా లబ్ధి పొందిన 82 కుటుంబాలతో మాట్లాడారు. కార్యకర్తల కుటుంబాలతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కొత్తగా పార్లమెంట్ పరిధిలో 18 మంది బూత్ స్థాయి కార్యకర్తలకు చెక్కులు అందజేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆయా కుటుంబాల మహిళలకు, వారి పిల్లలకు బహుమతులు అందించారు.

అధికార పక్షాన్ని నిలదీయండి

ఇందల్వాయి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికార పక్షం నాయకులను నిలదీయాలని ప్రజలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంతోపాటు ఇందల్వాయి తండా, త్రయంబక్‌పేట్ గ్రామాల్లో శుక్రవారం గడపగడపకి కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సాగునీటి సమస్యలు తీర్చి, వేగంగా పెన్షన్ల మంజూరు, రేషన్ కార్డు సమస్యలు తీర్చుతామని, పాత పథకాలు కొనసాగిస్తూనే పేదలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. నాయకులు నవీన్‌గౌడ్, యాదగిరి, పోలసాని శ్రీనివాస్, ముల్లంగి నర్సయ్య, సుధాకర్, బాడ్సి గంగారెడ్డి పాల్గొన్నారు.



ఇందల్వాయిలో పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న నగేశ్‌రెడ్డి

పేదలు, రైతుల పార్టీ కాంగ్రెస్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పేదలు, రైతుల పార్టీ కాంగ్రెస్ అని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కులాస్‌పూర్, కంజర్ గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, ఓట్లు అడిగిన వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, ఎల్లోల సాయిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేష్, ఎల్లయ్య, దిలావర్ హుస్సేన్, యూసుఫ్, సుధాకర్‌రెడ్డి, గంగారెడ్డి, అనిల్, రాజేంద్ర ప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.



కులాస్‌పూర్‌లో పథకాలు వివరిస్తున్న భూపతిరెడ్డి

మలేషియాలో జిల్లావాసులకు వేధింపులు

- అండగా నిలిచిన ఎంపీ బీబీ పాటిల్

కామారెడ్డి క్రైం : ఉపాధి బాటలో ఇక్కడి ఏజెంట్లను నమ్మి మలేషియా దేశానికి వెళ్లిన 21 మంది జిల్లా వాసులు మోసానికి గురై ఆగమయ్యారు. వెట్టి చాకిరీ, వేధింపులకు గురి కావడంతో వారంతా గురువారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను ఫోన్ ద్వారా ఆశ్రయించగా ఆయన వెంటనే స్పందించారు. మలేషియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి వారందరినీ సురక్షితంగా జిల్లాకు రప్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీ వర్గీయులు శుక్రవారం తెలిపారు. మచారెడ్డి మండలం పోతారం గ్రామానికి చెందిన పురముశెట్టి భాను, గాంధారి మండలానికి చెందిన బెస్త సాయిలు, సేవ్యా, బీమా, తాడ్వాయి మండలం నందివాడకు చెందిన రవి, సోమారంకు చెందిన రమేష్ లింగంపేట్ మండలానికి చెందిన మాలోత్ లాస్యతో పాటు మొత్తం 21 మంది మూడు నెలల క్రితం మలేషియాలో ఉద్యోగాలున్నాయని కామారెడ్డిలో ఏజెంట్లు చెబితే కంపెనీ వీసా మీద రూ. 1.50 లక్షలు చెల్లించి వెళ్లారు. అక్కడకు వెళ్లగానే వారిని రిసీవ్ చేసుకున్న వ్యక్తి పాస్‌పోర్టులు లాక్కుని ఓ కాంట్రాక్టర్‌కు అమ్మేశాడని బాధితులు పేర్కొన్నారు. రెండు నెలలుగా పని చేయించుకోవడం తప్ప జీతం ఇవ్వట్లేదని, కనీసం తిండికూడా పెట్టట్లేదని వాపోయారు. దీంతో వారంతా ఎంపీ బీబీ పాటిల్‌కు వాట్సప్ ద్వారా సమాచారం ఇచ్చి ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీ చొరవతో మరో 3–4 రోజుల్లో బాధితులు ఇక్కడకు తిరిగి రానున్నారు. వారంతా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.



మలేషియాలో చిక్కుకున్న జిల్లా వాసులు

ఇసుక లారీ పట్టివేత

దోమకొండ: మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రాజన్న సిరిసిల్లా జిల్లా నుంచి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో లారీని పట్టుకొని సీజ్‌చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



డాక్టరేట్ సాధించిన కర్క గణేశ్

తెయూ(డిచ్‌పల్లి): టీయూ ఫిజిక్స్ విభాగంలో మొదటిసారిగా పీహెచ్‌డీ డాక్టరేట్‌ను పరిశోధక విద్యార్థి కర్క గణేశ్ సాధించారు. టీయూ అధ్యాపకురాలు జి.లలిత పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ సింటరింగ్ మెథడాలజీ ఆన్ స్ట్రక్చరల్, మ్యాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ కాంపోసిట్ ఫెర్రైట్స్' అనే అంశంపై గణేశ్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శుక్రవారం నిర్వహించిన వైవాకు ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. గణేశ్‌ను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం గణేశ్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు అభినందించారు.

క్రైం కార్నర్

నీటి సంపులో పడి వ్యక్తి మృతి



లక్ష్మణ్(ఫైల్)

బాన్సువాడ/బాన్సువాడరూరల్: బాన్సువాడ పట్టణంలోని టౌన్ షిప్ వెంచర్‌లో ప్రమాదవశత్తు నీటి సంపులో పడి జగ్గ లక్ష్మణ్ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బోర్లం గ్రామానికి చెందిన లక్ష్మణ్ టౌన్ షిప్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మణ్ సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం వద్దకు వెళ్లి చూడగా నీటిలో మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి భార్య కాశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరు..



కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ప్రయాణిస్తున్న రైలు నుంచి వ్యక్తి కింద పడి మృతి చెందినట్లు సమాచారం అందడంతో కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, జేబులో ఉన్న టికెట్ ఆధారంగా దేనాపూర్ నుంచి సికింద్రాబాద్ ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 40 ఏండ్ల మధ్య ఉంటాడని, ఎవరైనా ఫొటో ఆధారంగా గుర్తు పడితే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిరుత దాడిలో మేక..

లింగంపేట(ఎల్లారెడ్డి): చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన మండలంలోని మెంగారం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తంత్రి అంజయ్య మేకలను అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లగా చిరుత మేకపై దాడి చంపేసిందని బాధితుడు తెలిపాడు. చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైం: మండలంలోని శాబ్దిపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి నిర్వహించామని వారి నుంచి రూ.65,790 నగదు, 8 సెల్ ఫోన్లు, ఆటో, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

బోధన్‌లో గొలుసు చోరీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులో ఓ మహిళ మెడ నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు సీఐ ప్రేమ్‌కుమార్‌తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోధన్ శివారులోని మర్రి మైసమ్మ ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్తుండగా బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన డొక్క పరశురాం (28) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పరశురాం రాత్రి వరకు ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పరశురాం అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐకేపీ ఉద్యోగి ఆత్మహత్య



సాయిలు(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గుడుమ బక్క సాయిలు(48) శుక్రవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. సాయిలు లింగంపేట ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య క్లస్టర్ కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాయిలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సవిత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో యువకుడు..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన బండారి రవి(29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరేళ్ల క్రితం హిప్పర్గ గ్రామానికి చెందిన సురేఖతో కొల్లూర్‌కు చెందిన రవితో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 23న వీరి మధ్య గొడవ జరగడంతో సురేఖ కూతురుని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులు, ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని లక్ష్మీనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన విజయ్‌కుమార్ (27) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఓ ప్రైవేటు కంపెనీలో ఫైనాన్స్ తీసుకొని బైక్ కొన్నాడు. కొన్ని వాయిదాలు పెండింగ్‌లో ఉండడంతో నిర్వాహకుల వేధింపులు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి బాలరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఒకరిపై కేసునమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం శివారులోని అటవీభూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు యత్నించిన మండలంలోని పల్లెబోగుడ తండాకు చెందిన దేవసోత్ బన్సీపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. బొల్లారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనిత విధుల్లో భాగంగా బొల్లారం అటవీ ప్రాంతంలోని కంపార్ట్‌మెంట్ నం.736లో గస్తీ నిర్వహిస్తుండగా సుమారు రెండెకరాల అటవీభూమిని అక్రమంగా చదును చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు బన్సీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు. ఎవరైనా అటవీభూమిని కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన బేతయ్య ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైనట్లు సర్పంచ్ రవీందర్ శుక్రవారం తెలిపారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ. 80వేల ఆస్తినష్టం జరిగిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.